శెనార్థి మీడియా
SILVER SCREEN
శనివారం
12-07-2025
SHENARTHI MEDIA

# మోనికా మేనియా అదుర్స్..



## 'కూలీ' నుంచి బుట్టబొమ్మ స్పెషల్ సాంగ్ రిలీజ్

సూపర్ స్టార్ రజినీకాంత్, స్టార్ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ కాంబో లేటెస్ట్ అవెయిటెడ్ మూవీ 'కూలీ' నుంచి సెకండ్ సింగిల్ వచ్చేసింది. ఇప్పటికే 'చికిటు' సాంగ్ రిలీజ్ కాగా ట్రెండింగ్‌గా మారింది. తాజాగా... బుట్టబొమ్మ పూజా హెగ్డే స్పెషల్ సాంగ్ రిలీజ్ చేసి మేకర్స్ ఫ్యాన్స్‌కు బిగ్ ట్రీట్ ఇచ్చారు.

**సాంగ్ అదుర్స్**

బుట్ట బొమ్మ పూజా హెగ్డే తనదైన జోష్, డ్యాన్స్‌తో అదరగొట్టారు. 'మోనికా బెలూచీ... ఎర్రంగి వందాచీ...' అంటూ సాగే లిరిక్స్ ఆకట్టుకుంటున్నాయి. పోర్ట్ ఏరియాలో సాంగ్ పిక్చరైజ్ చేయగా... పూజా హెగ్డేతో మలయాళ నటుడు సౌబిన్ కపూర్ 'మోనికా ఐ లవ్ యూ' అంటూ ఫుల్ ఎనర్జీతో వేసిన స్టెప్పులు వేరే లెవల్‌లో ఉన్నాయి. ఈ మూవీకి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ అందించగా... స్పెషల్ సాంగ్‌కు తనదైన గ్రేస్‌తో ఎనర్జీ లెవల్ పెంచేలా రెట్రో స్టైల్‌లో బీజీఎం అందించారు. ఈ పాటకు విష్ణు లిరిక్స్ అందించగా... సుభాషిణి, అనిరుధ్ రవిచందర్ కలిసి ఆలపించారు.

**ఆగస్ట్ 14న రిలీజ్**

ఈ మూవీలో రజినీకాంత్‌తో పాటు కింగ్ నాగార్జున, ఉపేంద్ర, శ్రుతి హాసన్, సౌబిన్ కపూర్, సత్యరాజ్‌తో పాటు బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్ గెస్ట్ రోల్‌లో నటించారు. భారీ బడ్జెట్‌తో సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ మూవీని నిర్మించారు. ఆగస్ట్ 14న తమిళంతో పాటు తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ చేయనున్నారు. గోల్డ్ స్మగ్లింగ్ బ్యాక్ డ్రాప్‌లో మూవీని తెరకెక్కించగా... మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా లోకేశ్ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. నాగార్జున ఈ సినిమాలో నెగిటివ్ రోల్ సైమన్ రోల్‌లో కనిపించనున్నారు. 'కూలీ నెంబర్ 1421'గా 'దేవా' రోల్‌లో తలైవా మాస్ లుక్‌లో కనిపించబోతున్నారు. ఇప్పటికే రిలీజ్ అయిన సాంగ్, లుక్స్ గూస్ బంప్స్ తెప్పిస్తున్నాయి. ప్రస్తుతం మూవీ పోస్ట్ ప్రొడక్షన్ పనులు సాగుతుండగా... ఐమాక్స్ ఫార్మాట్‌లోనూ సినిమాను అందుబాటులోకి తెస్తున్నారు.

**ఆమిర్ రోల్ పై ఇంట్రెస్ట్**

ఈ మూవీలో బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్ ఓ స్పెషల్ రోల్ చేయనున్నట్లు ఇటీవలే మేకర్స్ అనౌన్స్ చేశారు. 'దాహా' రోల్ మాస్ లుక్‌లో ఆమిర్ అదరగొట్టారు. ఆయన డాన్ రోల్ చేస్తున్నట్లు తెలుస్తుండగా... విక్రమ్ మూవీ క్లైమాక్స్ 'రోలెక్స్'లానే ఉంటుందని... స్టోరీని ఆయన రోల్ మలుపు తిప్పుతుందని సోషల్ మీడియాలో చర్చ సాగుతోంది. మరి వీటన్నింటిపై క్లారిటీ రావాలంటే మూవీ రిలీజ్ వరకూ ఆగాల్సిందే.



పవన్ కళ్యాణ్ అభిమానులకి మరో గుడ్ న్యూస్..

# అనుకున్న టైమ్‌కే ఓజీ

బ్రో చిత్రం తర్వాత పవన్ కళ్యాణ్ నుండి సినిమా రాలేదు. ఆయన సినిమాల కోసం పవన్ ఫ్యాన్స్ కళ్లల్లో ఒత్తులు వేసుకొని మరీ ఎదురు చూస్తున్నారు. పవన్ నటించిన హరిహర వీరమల్లు చిత్రం జులై 24న సందడి చేసేందుకు సిద్ధమైంది.రెండు సంవత్సరాల విరామం తర్వాత, పవన్ మళ్లీ వెండితెరపై సందడి చేయబోతున్నారు. ఇక ఇదిలా ఉంటే మరో బిగ్ అప్‌డేట్‌తో పవన్ టీమ్ ముందుకొచ్చింది. ఆయన నటిస్తున్న మరో భారీ చిత్రం ఓజీ షూటింగ్‌ను కూడా పూర్తి చేసినట్టు అధికారికంగా ప్రకటించారు. "ఫైరింగ్ ఫినిష్డ్" అంటూ ఓ పోస్టర్‌తో ఈ విషయాన్ని వెల్లడించారు. సుజీత్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. ఇటీవలి కాలంలో ఈ సినిమా వాయిదాపై గాసిప్స్ వినిపించాయి. కానీ డీవీవీ ఎంటర్టైన్‌మెంట్స్ వాటికి చెక్ పెడుతూ, సినిమా సెప్టెంబర్ 25న రిలీజ్ అవుతుందని మరోసారి స్పష్టత ఇచ్చింది. కొత్త పోస్టర్‌తో మరోసారి ఇదే తేదీని కన్ఫర్మ్ చేశారు.ఈ సినిమాలో పవన్ సరసన ప్రియాంక మోహన్ నటిస్తుండగా, బాలీవుడ్ విలన్ ఇమ్రాన్ హష్మి ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. ఆయనతో పాటు శ్రియా రెడ్డి, అర్జున్ దాస్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.'ఓజీ' చిత్ర కథ ముంబయి గ్యాంగ్‌స్టర్ నేపథ్యంతో సాగుతుంది. పవన్ ఇందులో గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు. యాక్షన్‌కు తోడు ఈ సినిమాలో ఫ్యామిలీ సెంటిమెంట్, బ్రదర్–సిస్టర్ ఎమోషన్స్ కీలకంగా నిలవనున్నాయి. ఎమోషనల్ ట్రాక్ సినిమాకి ప్రధాన హైలైట్ కానుంది. పవన్ కళ్యాణ్ కొద్ది గ్యాప్‌లోనే రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. జులై 24న హరిహర వీరమల్లు, సెప్టెంబర్ 25న ఓజీ విడుదల కాబోతుండటంతో, ఫ్యాన్స్ ఆనందం అంతా ఇంతా కాదు. ఇప్పటికే పవన్ ఎక్కడ పబ్లిక్ ఈవెంట్‌కి వెళ్లినా ఓజీ ఓజీ అంటూ నినాదాలు వినిపిస్తున్నాయి. దీనిని బట్టే ఓజీ క్రేజ్ ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతోంది. ఈ రెండు సినిమాలు ఘన విజయం సాధిస్తే, పవన్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలవొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

# తెలుగు సినిమాతోనే నాకు తొలి విజయం

"నా కెరీర్‌కు బలమైన ఆరంభం ఇచ్చింది తెలుగు సినిమా. 'గబ్బర్ సింగ్' చిత్రం నా జీవితాన్ని మలుపు తిప్పింది. మొదట ఈ సినిమాలో నటించాలనుకోలేదుగానీ, దర్శకుడు హరీష్ శంకర్ నన్నే ఎంపిక చేయడంతో ఒప్పుకున్నా. ఈ హిట్ సినిమాతోనే ప్రేక్షకులకు చేరువయ్యాను. పవన్ కల్యాణ్ వంటి పెద్ద హీరోతో పనిచేయడం ఆరంభంలో భయమేసింది. కానీ ఆయన సెట్లో అందరినీ గౌరవంగా చూస్తారు" అని చెప్పింది శ్రుతిహాసన్.

**జ్యోతిష్యం నమ్మినా, నాన్న వ్యతిరేకం**

"నాన్న (కమల్‌హాసన్) దేవుళ్లకు, ఆచారాలకు దూరంగా ఉంటారు. జ్యోతిష్యంపై నమ్మకం లేదు. కానీ నేను మాత్రం బలంగా జ్యోతిష్యాన్ని నమ్ముతాను. నేను మాట్లాడితే నవ్వుతూ బయటికి వెళ్లు అంటారు. అయినా నా నమ్మకాలను గౌరవిస్తారు" అని చెప్పింది.

**రజనీకాంత్‌తో కలిసి నటించడం అదృష్టం**

"ప్రస్తుతం 'కూలీ' చిత్రంలో రజనీకాంత్‌తో నటిస్తున్నాను. ఆయనను అభిమానిగా చూసిన నాకు, ఇప్పుడు ఆయనతో కలిసి పని చేయడం గొప్ప అనుభవం. తమిళ పరిశ్రమకు నాన్న, రజనీ ఇద్దరూ రెండు కళ్లలాంటి వాళ్లు" అని వివరించింది.

వివాహంపై స్పష్టత

"వివాహ బంధాన్ని గౌరవిస్తాను. కానీ అది కేవలం ఓ కాగితంతో నిర్ధారించాల్సిన అవసరం లేదు. ప్రేమపై నమ్మకం ఉన్నా.. పెళ్లి పట్ల భయం ఉంది. ఓసారి పెళ్లికి దగ్గరగా వెళ్లాను. కానీ అది సాగలేదు. పెళ్లంటే ఇద్దరు వ్యక్తుల జీవితకాల బాధ్యత" అని అభిప్రాయపడింది.







# ఓటీటీలోకి 'కుబేర'.. అధికారికంగా ప్రకటించిన సంస్థ

**సినిమా డెస్క్:** శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్, నాగార్జున, రష్మిక ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కుబేర'. ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ చిత్రం సినీప్రియుల్ని ఆకట్టుకుంది. ఇప్పుడీ సినిమా ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా (Amazon Prime Video) జులై 18 నుంచి స్ట్రీమింగ్ కానుంది. గత కొన్ని రోజులుగా దీని ఓటీటీ విడుదలపై ఎన్నో వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వాటికి చెక్ పెడుతూ.. తాజాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ అమెజాన్ ఓ పోస్టర్ విడుదల చేసింది.

కథేంటంటే: దేశంలోనే అత్యంత సంపన్నుడైన గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ సీఈవో నీరజ్ మిత్ర (జిమ్ సర్బ్) ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా నిలవాలని కలలు కంటుంటాడు. ఆ కల కోసం ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సాగర్ ప్రాజెక్ట్‌ను వినియోగించుకోవాలనుకుంటాడు. రూ.లక్ష కోట్ల డీల్ కుదుర్చుకుంటాడు. ఆ మొత్తం డబ్బులో రూ.50 వేల కోట్లు బ్లాక్‌లో.. మిగిలిన డబ్బు వైట్‌లో ఇవ్వాలని నీరజ్‌కు సిద్ధప్ప షరతు విధిస్తాడు. ఈ పనిని సమర్థంగా చేయడం కోసం జైల్లో ఉన్న మాజీ సీబీఐ అధికారి దీపక్ తేజ్ (నాగార్జున)ను బయటకు తీసుకొస్తాడు. ఈ పని కోసం దీపక్ బిచ్చగాళ్లను ఎంచుకుంటాడు. ఈ పని పూర్తి కాగానే ఆ నలుగురు బిచ్చగాళ్లను చంపేయాలని నీరజ్ ప్లాన్ చేయగా.. వారిలో ఒకడైన దేవా (ధనుష్) తప్పించుకుంటాడు. మరి వీళ్ల చేతికి దేవా దొరికాడా? తన ఖాతాలో ఉన్న వేల కోట్ల డబ్బును దేవా ఏం చేశాడు? అన్నది మిగిలిన కథ.

# ప్రేమిస్తే కచ్చితంగా మారతారు: రష్మిక

వరుస సినిమాలతో అలరిస్తున్నారు నేషనల్ క్రష్ రష్మిక ఆమె నటించిన 'యానిమల్' ఎంతటి విజయాన్ని సొంతం చేసుకుందో.. అదే స్థాయిలో విమర్శలు కూడా వచ్చాయి. తాజాగా రష్మిక ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తనకు ఆ సినిమాలో హీరో పాత్ర లాంటి వ్యక్తితో డేటింగ్ చేయడానికి అభ్యంతరం లేదన్నారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. ఇదే ఇంటర్వ్యూలో ఆమె ప్రేమపై తన అభిప్రాయాన్ని కూడా పంచుకున్నారు. నిజ జీవితంలో 'యానిమల్'లో హీరో పాత్ర స్వభావం ఉన్న వ్యక్తితో మీరు డేటింగ్ చేస్తారా? అతడిలో మార్పు తీసుకు రాగలరా? అని అడిగిన ప్రశ్నకు రష్మిక ఆసక్తికర సమాధాన మిచ్చారు. "మనం ఎవరినైనా ప్రేమిస్తే.. మనల్ని ఎవరైనా ప్రేమిస్తే.. మార్పు కచ్చితంగా జరుగుతుందని నేను నమ్ముతా ను. ఎందుకంటే భాగస్వామితో కలిసి ఉంటున్నప్పుడు వారితో కలిసి జీవితాన్ని పంచుకుంటున్నప్పుడు ఇద్దరి వ్యక్తిత్వాల్లో మార్పు వస్తుంది. ఒకరికి ఒకరు అభిప్రాయాలు పంచుకుంటారు. ఇష్టాయిష్టాలు తెలుసుకుంటారు. ఒకరి కోసం ఒకరు మారతారు. మీ ప్రాణ స్నేహితుడితో కాని, మీ భాగస్వామితోనే కాని కొంతకాలం కలిసి ప్రయాణించాక.. అకస్మాత్తుగా పాత రోజులను గుర్తుచేసుకుంటే వారి కోసం మీరు ఎంతలా మారారో అర్థమవుతుంది. ఆ మార్పునకు ఒక్కోసారి మీరే ఆశ్చర్యపోతారు" అని చెప్పారు. తాను అర్థంచేసుకునే భాగస్వామి గురించి మాత్రమే మాట్లాడినట్లు తెలిపారు. ప్రస్తుతం రష్మిక వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయుష్మాన్ ఖురానాతో కలిసి 'థామా' అనే హారర్ కామెడీలో నటిస్తున్నారు. దీనితో పాటు 'ది గర్ల్‌ఫ్రెండ్'తో సిద్ధమవుతున్నారు. తాజాగా 'మైసా' అనే చిత్రాన్ని కూడా ప్రకటించారు. అలాగే అట్లీ– అల్లు అర్జున్‌ల సినిమాలోనూ ఈ అమ్మడు కనిపించనున్నట్లు వార్తలు వస్తున్నాయి.